# కన్నీరు కార్చనా కన్న

## ఉషోదయవేళ....

గుప్పిట బిగించిన అనుభూతుల్ని లోకానికి అందివ్వాలనే తాపత్రయంలో తప్పటడుగులు వేస్తున్న బాలభానుడు...

చెట్లపై పక్షుల కిలకిలా రావాలు...ప్రకృతి సుప్రభాతం పాడుతోంది...

ఏ మంచుకొండల అంచులనో తాకి వచ్చిన చిరుగాలి మా చెంపల్ని స్పృశిస్తూ చెవిలో ఏదో గుసగుసలాడబోయి కుదరకపోవడంతో వెక్కిరింతగా నవ్వుతూ వెనుతిరిగింది. ప్రాతఃకాల ప్రశాంతతలో ఇద్దరం తడుస్తూ నెమ్మదిగా నడుస్తున్నాము. ఆయన భుజానికి తల ఆన్చి నిర్మలమైన హృదయాల ఊసుల్ని దొంగ చాటుగా వింటూ ఇంటివైపు యాంత్రికంగా కదులుతున్నాను. రాత్రి కురిసిన వర్షాన్ని ఒళ్ళో దాచుకున్న చెట్లు భారంగా కదులుతున్న తమ కొమ్మల్ని నిశ్శబ్దంగా గమనిస్తున్నాయి. నేలంతా అదో రకమైన వాసన వేస్తోంది. పట్టణపు రణగొణ ధ్వనులకు దూరంగా అందంగా పేర్చిన అగ్గిపెట్టెల్లాంటి ఇళ్ళ మధ్యనుండి మా వాకిట ప్రవేశించి గేటు తీయబోయి నేనూ, ఆయనా ఒకేసారి ఉలిక్కిపడ్డాం. గేటుకు కుడి వైపు దట్టంగా పెరిగిన పిచ్చి చెట్ల మధ్య నుండి దీనంగా పిల్లి పిల్ల కాబోలు రోదిస్తోంది. ఆయన వెళ్ళి చెట్లను తప్పించి 'చిన్న పిల్లి పిల్ల...ఇంకా కళ్ళు తెరవలేదు' అంటూ వెనుతిరగబోయారు. నేను ఒక్క ఉదుటున అక్కడకు చేరి ఆ పిల్లిపిల్ల వైపు చూశాను.

చలితో గజగజవణుకుతోంది. మాతృగర్భపు మత్తులోనుంచి బయటపడినట్లు వుంది. పద అన్నట్లు నా చెయ్యి పట్టుకుని ఆయన 'పనిమనిషి రాగానే దూరంగా ఎక్కడైనా వదలిరమ్మని చెప్పు' అన్నారు. ఆకాశం మేఘాలతో నిండివుంది. మళ్ళీ వర్షం రావచ్చు. ఆయన తోపాటు గేటుదాకా నడిచిన నేను ఆ పిల్లికూన రోదన భరించలేకపోయాను. ఒక్క అంగలో దగ్గరకు చేరి ఆ పిల్లను చేతుల్లోకి తీసుకున్నాను. ఆయన ఆశ్చర్యంగా చూశారు.

● ● ● ●

పాత చీరల్ని చిన్న ముక్కలుగా చించి కూరగాయల బుట్ట అడుగున వేసి ఊయల తొట్టెలా చేసి పిల్లి కూనను అందులో పడుకోబెట్టాను. ఆయన రక్తం మరకలు ఆరని పిల్లి పిల్లను చేతుల్లోకి తీసుకున్నందుకు అసహ్యంగా ఒళ్ళు విదిలించినా పెంచుకుందామన్న నా ప్రపోజల్‌కు ఏదో గొణుక్కుంటూ ఆమోదముద్ర వేసి ఆఫీసుకు వెళ్ళిపోయాక వంట పనికి కామా పెట్టి టీ స్పూన్‌తో పిల్లిపిల్ల దగ్గరకు చేరాను. చలిబాధ నుండి రక్షింపబడడం వల్ల చిన్న కునుకు తీస్తున్నదల్లా నా చెయ్యిపడగానే ఆకలితో కాబోలు మళ్ళీ కేకలు మొదలుపెట్టింది. దాన్ని ఒళ్ళోకి తీసుకుని స్పూన్‌తో పాలు నోట్లో పోస్తూవుంటే ఒక్క చుక్కయినా మింగకుండా అన్నీ కక్కేసి నేనేదో దాని గొంతు నులుముతున్నంతగా గిలగిలలాడుతూ ఎర్ర నోటికి మరింత ఎరుపు పులిమి కుమిలి కుమిలి ఏడ్వడం మొదలుపెట్టింది. మెల్లగా బుజ్జగిస్తూ మళ్ళీ ప్రయత్నించాను. ఫలితం శూన్యం. కోపంగా దాన్ని బుట్టలోకి నెట్టి తలపట్టుకు కూర్చుండిపోయాను. ఎలా తాగించాలి? ఏం చేస్తే తాగుతుంది. అది అలాగే పాలు తాగకుండా ఆకలితో చనిపోతే బాధవేస్తుంది. పనిమనిషి వచ్చినప్పుడే తల్లి దగ్గరకు చేర్చమని ఇచ్చేస్తే సరిపోయేది. అనవసరంగా తలనెప్పి తెచ్చిపెట్టుకున్నాను. పాపం... అది ఆకలితో అలమటిస్తూవుంటే దాన్ని వదిలించుకునే ఉపాయాల గురించి ఆలోచిస్తున్నందుకు అంతరంగం తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తంచేయడంతో లేచి తలుపుగొళ్ళెం పెట్టి వెళ్ళి పెద్దగా పరిచయం లేకున్నా పక్కింటివారి తలుపుతట్టాను.

తలుపుతీసి నన్ను చూసి ఆమె—దాదాపు నలభై ఏళ్ళు వుంటాయి. ఆశ్చర్యపోయి వెంటనే తేరుకుని రండి రండంటూ ఆహ్వానించింది. మామూలు సంభాషణల తర్వాత 'మీ దగ్గర వాడేసిందైనా ఫర్వాలేదు నిప్పల్ వుందా?' అంటూ అడిగాను. ఆమె నన్ను ఒక్కసారి పట్టిపట్టి చూసి..'నిప్పల్...పిల్లలకు పాలు పట్టేదేగా...మీకెందుకు' అంటూ అడిగితే తన మాటల్లో కదలాడిన అస్పష్టతను గమనించనట్లు పిల్లిపిల్ల గురించి వివరించి మళ్ళీ అడిగాను. ఆమె అదోలా చూస్తూ దీనంగా నిట్టూర్చి డబ్బాలన్నీ వెతికి ఓ నిప్పల్‌ను సాధించి నా చేతిలో పెట్టింది. 'థాంక్స్' అని చెప్పి వెనుతిరిగాను.

నేను మా ఇంట్లో ప్రవేశిస్తూవుండగా తలుపు పెట్టేసి చరచరా పక్కింట్లోకి వెళుతున్న ఆమెను చూసీచూడనట్లు చూస్తూ చిన్నగా నవ్వుకున్నాను. 'పిల్లలులేని తల్లికి పిల్లిపిల్లపై పుట్టిన జాలి' ఈ టాపిక్‌పై విట్లువేసుకుని నవ్వుకుంటారు. నవ్వుకోనీ...

***** *****

సాయంకాలం వరకూ నాలుగుసార్లు నిప్పల్ సహాయంతో పాలుపట్టాను. చప్పరిస్తూ తాగింది. నా అలికిడి వినగానే ఏడుపు మానేసి అది నోరు విప్పడం అంత తొందరగా ఆ పసిప్రాణి పరిస్థితులకు అనువుగా మారిపోవడం చూసి అబ్బురపడిపోయాను. సాయంత్రం సరిగ్గా ఆయన ఆఫీస్ నుండి వచ్చే సమయానికి ఇల్లు అదిరిపోయేలా ఏడుపు మొదలుపెట్టింది. చదువుతున్న నవలను పక్కకు విసిరేసి పరుగెత్తుకు వెళ్ళి పాలపీక దాని నోటికి అందించాను. చిన్నారి కాళ్ళతో పాలపీకను తన్నివేసింది. మెల్లిగా తలపై చెయ్యివేసి నిమరబోయాను. కోపంగా ముందుకాళ్ళతో నా చేతుల్ని పక్కకు తోసింది. పిచ్చిముండ నాలుగుసార్లు పాలు



పట్టగానే నేను దాని కొరకు నియమింపబడ్డ పనిమనిషిగా భావించి బాధ్యతల్ని విస్మరిస్తున్నానని కోపం తెచ్చుకుందేమో! ఏమో....

ఒక చేత్తో నొక్కిపట్టుకుని మరో చేతితో పాలపీక దాని నోట్లో కుక్కాను. మెలికలు తిరిగిపోతూ ఎలాగైతేనేం పట్టు తప్పించుకుని ఆ చిన్నిబుట్టలోనే నా చెయ్యి దాని శరీరాన్ని తాకకుండా జాగ్రత్తపడుతూ యథావిధిగా ఏడుపును కొనసాగించింది. ఏం చేయాలో పాలుపోలేదు. ఓ స్త్రీగా కాకుండా జన్మనిచ్చే మాతృమూర్తి స్థాయికి ఎదిగి ఆ కోణం నుంచి ఆలోచించడం మొదలుపెట్టాను. వర్షంబారి నుండి కాపాడి మెత్తటి పక్క ఏర్పాటుచేశాను. క్షుద్బాధ తీర్చాను. నిద్రకు దూరమైతే తల నిమురుతూ జోకొట్టాను. మళ్ళీ ఆకలా....కాదు....నాలుగుసార్లు పాలుపట్టాను కనుక అవును...తాగిన పాలన్నీ దాని చిట్టిబొజ్జలోనే వుండిపోయాయి. సాగిపోతున్న ఆలోచన్ల స్రవంతిలో సమస్య తేలిపోయింది. నన్ను నేనే అభినందించుకుని దాని పక్క బట్టలు తడిమి చూశాను. నా ఊహ నిజమే... కాని కన్నా నువ్వు మూత్ర విసర్జన చెయ్యి అంటూ దానికెలా చెప్పాలో అర్థంకాలేదు.

సామాన్య స్త్రీ మాతృమూర్తిగా మార్పు చెందుతూ




ఎన్ని సమస్యలను ఎదుర్కోవాల్సొంటుందో అప్పుడు తెలియ వచ్చింది. జన్మనివ్వడమే గగనకుసుమం అయితే తన గర్భం చీల్చుకు బయటపడ్డ, భాషా, భావం ఎరుగని మాంసం ముద్దకు అన్నీ నేర్పాలి. క్లిష్టమైన సమస్యకు పరిష్కార మార్గం సూచించడమే మేధావితనమైతే ప్రపంచంలోని ప్రతి ఆడప్రాణి మేధావే. ఆ పిల్లి కూనను బుట్టలో నుంచి చేతుల్లోకి తీసుకున్నాను. ఆ తీసుకోవడంలో నా చెయ్యి దాని పొత్తి కడుపును తాకడంతో టక్కున ఏడ్వడం ఆపేసింది. అలాగే కుడి చేతితో మెల్లమెల్లగా పొత్తి కడుపు ప్రాంతాన్ని నిమర సాగాను. అది హాయిగా మగత నిద్రలోకి జారిపోతూ నా చేతుల్ని తడిపివేసింది.

నిశ్శబ్దంగా దాన్ని తిరిగి బుట్టలో పడుకోబెట్టి నేను వెనుతిరగడం ఆయన గారు ఇంట్లో అడుగుపెట్టడం ఒకేసారి జరిగింది. ఆ మరుసటిరోజు అది అప్పుడే విచ్చుకున్న తన చిన్నారికళ్ళను ప్రశంసాపూర్వకంగా కదిలిస్తూ నన్ను గుర్తించడానికి ప్రయత్నించడం చూసి నా హృదయం ఏదో తెలియని అనుభూతికి గురైంది.

• • • •

పిల్లిపిల్ల ఆగమనంతో కొన్ని కోర్కెలకు కళ్ళెం వేశాము. వాటిలో మొదటిది మార్నింగ్ వాక్, రెండోది సినిమాలు, అలాగే హిపోక్రాటిక్ మనుష్యుల మధ్య ఒంటరితనం అనుభవిస్తున్న మనస్సుకో తోడు దొరికినందుకు ఆనందపడ్డాను. కనీసం ఆయన గారినైనా సంప్రదించకుండా 'కన్నా' అనే పేరు ఆ కూనకు పెట్టేసుకున్నాను. కొద్దిరోజుల్లోనే అది పేరుకు ప్రతిస్పందించడం మొదలుపెట్టింది.

మాకు ఇద్దరికీ కాఫీ కలిపి మిగతా పాలను సాసర్లో వల్లార్చి కన్నకు తాగించి పనిమనిషి ముందు కడగాల్సిన పాత్రలు వేసి పేపరు అందుకోగానే ఒళ్ళో కూర్చుని నాతోపాటు అది చదవడానికి ప్రయత్నించడం మొదలుపెట్టింది. ఉదయం ఏడు దాటిందంటే చాలు నా ఆజ్ఞ లేకున్నా బెడ్రూంలో జొరబడి నానా హంగామా చేసి ఆయన గారిని నిద్ర లేపడం నేర్చుకుంది. బంగారంలాంటి నిద్ర పాడుచేసినందుకు ఆయన కన్నను కొట్టడానికి తరుముకొస్తే అది పరుగెత్తుకువచ్చి నా వెనకాల దాక్కొని ఆయనను వెక్కిరించడం' రివాజైంది. నన్ను మభ్యపెట్టి వంటింట్లోకి ప్రవేశించి ఉల్లిపాయల్ని గది మొత్తం వెదజల్లడం, మసిగుడ్డలను మాయం చేయడం లాంటి చిలిపి పనులు చేసి నాతో చివాట్లు పెట్టించుకుని అలిగిపడుకోవడం లేదా కొడితే కొట్టుకాని తిడితే మాత్రం సహించను అంటూ కోపంగా నా కాలును పీకడానికి రెడీ!

కన్న ప్రతి కదలిక నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. అది ప్రతి విషయంలోనూ నన్ను అనుకరించడం చూస్తే నవ్వు వస్తుంది. ఎక్కడున్నావనే కన్నా అని పిలవగానే మ్యావ్‌నే ఓ గా మార్చి తోకను నిటారుగా ఎత్తిపట్టుకుని ప్రత్యక్షమై 'ఎందుకు పిలిచావు' అన్నట్లు కళ్ళల్లో కళ్ళుపెట్టి ప్రశ్నిస్తున్నట్లు చూడడం నేను ఎక్కడికి వెళ్ళినా అడుగుల్లో అడుగులు వేస్తూ గంభీరంగా అనుసరించడం, నేను తినేదాకా తినకపోవడం, ఏ కొద్ది క్షణాలు నేను కన్పించకపోయినా గొంతును తీవ్ర స్థాయిలో పెంచి ఏడ్వడం, దాని ఏడుపు విని నేను ఆదుర్దాగా దగ్గరకు పరిగెత్తితే ఎక్కడికి వెళ్ళావు అన్నట్లు గారాలుపోతూ నేలపై దొర్లడం—ఎవరూ గుర్తించని చిన్న చిన్న అనుభూతులైనా అవే నన్ను ఆకట్టుకుని మానసికంగా నన్ను కన్నకు చాలా దగ్గర చేశాయి.

రెండు రోజులు శ్రమపడి స్వెట్టర్‌లాంటిది అల్లి కన్నకు వేస్తే రెండు గంటల్లో చింపి పోగులు పెట్టింది. ఆయనకు కూడా కన్న అంటే అభిమానం పెరిగిపోయింది. సాయంకాలం ఇద్దరం ఇంటిముందు కబుర్లు చెప్పకుంటూ కూర్చుంటే కన్న అతి లాఘవంగా తూనీగల్ని పట్టి తెచ్చి మా ముందు వేసి ఘనకార్యం చేశాను అభినందించండి అన్నట్లు మా వైపు చూడడం మేం మాటల్లో దాని ఉనికిని మర్చిపోతే భయంకరమైన అల్లరి సృష్టించి మా దృష్టిని తన వైపు ఆకర్షించుకోవడంలాంటి సంఘటనలతో రోజులు పరిగెత్త సాగాయి.

• • • •

కన్న కొన్ని తెలుగు పదాలు నేర్చుకుంది. ఉచ్చారణలో మ్యావ్‌లు వున్నా వచ్చే శబ్దాన్నిబట్టి అది ఏం చెప్పదల్చుకున్నదో అర్థమైపోయేది. ప్రకృతిపరంగా ఎలాంటి లోపాలులేని మేము డాక్టర్ల చుట్టూ తిరగడంలోనే రోజులు నెలలుగా రూపాంతరం చెందాయి. నిశ్శబ్దపు గుండెల్లో ఆశ హారతి కర్పూరమై ఒకర్ని ఒకరం ఓదార్చుకుంటూవుండగా కన్న యవ్వనంలోకి అడుగుపెట్టింది. ప్రవర్తనలో మార్పులేని దాని తోడు వల్ల ఆ తర్వాత అనర్థమైన మానసిక ఆందోళన నుంచి బయటపడి పెదవులపై నవ్వుల పూవుల్ని పూసుకోగలుగుతున్నాను.

భారత స్త్రీగా జన్మించడం వల్ల భర్త వున్నా మా ఇద్దరికీ మూడో తోడు లేకపోవడం వల్ల ఒంటరితనపు ఊబి ఛాయలకు నన్ను వెళ్ళనివ్వకుండా కాపాడిన కన్న వున్నట్లుండి ఓ రోజు రాత్రి ఏడు గంటలకు ఎటో వెళ్ళిపోయింది. ఇద్దరం చుట్టుపక్కల వెతికి 11 గంటల దాకా ఎదురుచూసి ఏ ప్రమాదం జరిగిందో అన్న అనుమానంతో ఆ రాత్రి కలతనిద్రలో గడిపాం.

మా కాలనీ జాతీయరహదారికి దగ్గర కావడంతో అటు వెళ్ళి ఏ వాహనం పడిపోయిందోనన్న భయంతో తెలతెలవారుతూవుండగా ఆయనను నిద్రలేపి ఇద్దరం వెళ్ళి అనుమానమున్న ప్రదేశాలన్నీ వదలకుండా వెదికి కన్నా కనిపించని నిరాశతో వెనుతిరిగాం. ఆయన

అన్యమనస్కంగా ఆఫీసుకు వెళ్ళిపోయాక ఒక్కసారిగా ఒంటరితనం అనుభవించి కన్నా జ్ఞాపకాలతో కలిసిపోయి ఎప్పటినుంచో నొక్కిపట్టిన కన్నీరు చెలియలి కట్ట దాటింది. మధ్యాహ్నం రెండు ముద్దలు బలవంతంగా మింగి మనసుమూల కదలాడిన ఆశ వల్ల కొద్ది అన్నాన్ని కలిపి కన్నా ప్లేట్‌లో పెట్టి తలుపులన్నీ వేసి మంచంపై వాలిపోయాను. సృష్టిలో అనుభూతులకు ప్రాణమిచ్చే జీవి మానవుడొక్కడేనేమో! ఏ చిన్న శబ్దమైనా పరిగెత్తుకెళ్ళి తలుపుతీసి చూసి నిరాశపడిపోతూ ఎప్పుడో నిద్రలోకి జారిపోయాను. సాయంకాలం ఆయన ఆఫీస్ నుండి వచ్చి కాలింగ్‌బెల్ నొక్కడంతో ఉలిక్కిపడి కళ్ళు విప్పాను. వెళ్ళి తలుపు తీయగానే కన్నా వచ్చాడా? అంటూ ఆయన అడగడంతో మౌనంగా తల అడ్డంగా ఊపి టీ కొరకు వంటింట్లోకి వెళ్ళి ఆశ్చర్యపోయాను. కన్నా ప్లేట్ నీటుగా కడిగేసినట్లు వుంది. ఒక్కసారి ఉప్పొంగిన ఆనందంతో ఆయన దగ్గరకు పరిగెత్తి 'ఏవండీ' అంటూ ఆ ఆనందంలో మాట్లాడలేక ఆయన చెయ్యి పట్టుకుని వంటింట్లోకి తీసుకెళ్ళి ప్లేట్ వైపు చూపించాను. ఇద్దరం తీసివున్న కిటికీ వైపు చూశాం. అప్పటికి కన్నా వచ్చి వెళ్ళాడన్న నిజం, అంతకన్నా అది క్షేమంగా వుందన్న నమ్మకం కుదిరిపోవడంతో హాయిగా ఊపిరిపీల్చగలిగాం. మళ్ళీ దాని గురించి చుట్టుపక్కల ఇళ్ళల్లో వెతికి కన్పించక పోవడంతో ఆ రాత్రి కూడా దానికి అన్నం కలిపి పెట్టి పడుకున్నాను. ఉదయాన్నే చూస్తే దాని ప్లేట్ ఖాళీగా వుంది. అంటే ఏ అర్ధరాత్రో వచ్చి వెళ్ళింది. అది ఎందుకిలా ప్రవర్తిస్తోందో అర్థంకాలేదు. నేనెక్కడో నిర్లక్ష్యంగా ప్రవర్తించడం వల్ల కోపం వచ్చిందేమో. ఎంత కోపం తెచ్చుకున్నా రోజులకురోజులు కన్పించకుండాపోతుందా? నా అపరిష్కృత ఆలోచన్లను పరిష్కరిస్తూ ఆ మరుసటిరోజు మధ్యాహ్నం చిన్నగా ఏదో తప్పు చేసినట్లు నా ముందుకు వచ్చింది. దాన్ని చూడగానే అర్థంలేని బాధను గాలిలోకి వదిలి ఎక్కడికి వెళ్ళావురా అంటూ ఏవేవో ఊసులుచెప్పబోయాను.

అది తలవంచుకుని నెమ్మదిగా ముందు కాళ్ళను నేలకు సమాంతరంగా పెట్టి వంగి నమస్కరించినట్లు కొద్ది క్షణాలు వుండి తర్వాత నా వైపు చూడకుండా కిటికీ దగ్గరకు వెళ్ళి అవతలివైపుకు దూకేసింది. తడబడుతున్న అడుగులతో కిటికీ దగ్గరకు పరిగెత్తి దాని వైపు చూశాను. నీటి పొరలతో మసకబారిపోతున్న కళ్ళకు ప్రహరీగోడ దాటిపోతున్న కన్నా అస్పష్టంగా కనిపించింది. ఒంటరిగా లేదది...ప్రక్కన మరో ఆడ పిల్లి వుంది. ఆ రాత్రి ఆయన గుండెపై తల ఆన్చి నేను వెక్కి వెక్కి ఏడుస్తూవుంటే ఛ..ఛ..మరీ ఇంత సెంటిమెంటల్ ఫూల్ అనుకోలేదు. ఎవరికైనా చెబితే నవ్వుతారు. అంటూ అనునయంగా నా తలపై చెయ్యి వేశారు. జన్మించిన పిల్లలతో పురిటి నుండి ప్రత్యక్షంగా చిన్న చిన్న అనుభూతులను చవిచూడని మగవారికి అంతమాత్రమే తెలుసు, మాతృత్వపు కన్నీటి విలువ! ●




# శుభం! శుభం! జన్మదినం


సెప్టెంబర్ 8 నుండి సెప్టెంబర్ 14 లోపున పుట్టిన రోజు జరుపుకున్న ప్రియపాఠకులకు ఉదయం నవతరం వారపత్రిక శుభాకాంక్షలు అందిస్తోంది.



టి.చందన
పుట్టినతేదీ
15–9–89
హిందూపూర్.




ఎన్.రాములు,
పుట్టినతేదీ
16–9–89
హైదరాబాద్



కె.బలరామ్
పుట్టినతేదీ
17–9–89
హైదరాబాద్



బి.ధనలక్ష్మి
పుట్టినతేదీ
18–9–89
హైదరాబాద్



టి.వెంకటేష్‌గౌడ్
పుట్టినతేదీ
19–9–89
మలక్‌పేట



నవీన్
పుట్టినతేదీ
20–9–89
హైదరాబాద్



ఎన్.ఆర్.రవిందర్
పుట్టినతేదీ
21–9–89
వేల్పూరు

అక్టోబర్ 1వ తేదీ నుండి 7వ తేదీ లోపున పుట్టిన ప్రియ పాఠకులూ, మీ ఫోటోతో పాటు ఈ కూపన్ జతచేసి పంపండి ప్రచురిస్తాం.

**కూపన్**

పేరు: ____________

పుట్టినతేదీ: ____________

చిరునామా: ____________

సంతకం: ____________

